ప్రజాశక్తి
ఆదివారం 26 అక్టోబరు, 2025
5
శ్రీకాకుళం



రేపట్నుంచి బిఎస్ఎన్ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలోని తమ వినియోగదారులకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతో బిఎస్ఎన్ఎల్ ఈ నెల 27 నుంచి విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జనరల్ మేనేజర్ మర్రి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 2న వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమం ద్వారా తమ ఉద్యోగుల్లో అవినీతి నిరోధంపై వినియోగదారులకు అవగాహన పెంచడం ముఖ్య ఉద్దేశమన్నారు. సిబ్బంది సంబంధిత వ్యవహారాల్లో అవినీతికి పాల్పడినట్లుగా వినియోగదారులు గుర్తించినట్లయితే తక్షణమే ఫిర్యాదు చేయాలన్నారు. ఇటువంటి ఫిర్యాదులను ఉప మండల ఇంజనీర్ (విజిలెన్స్), జనరల్ మేనేజర్ కార్యాలయం, సంచార్ భవన్, బిఎస్ఎన్ఎల్, శ్రీకాకుళం చిరునామాకు పంపవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ల్యాండ్‌లైన్ నంబర్ 08942-226700 లేదా మొబైల్ నంబర్ 94416 68789ను సంప్రదించవచ్చన్నారు.

పిక్నిక్‌కు పోదాం

చలో...



ఉరుకులు పరుగుల జీవితంలో పిల్లల చదువులు.. ఆఫీసులో పనులు.. ఒత్తిడుల మధ్య బంధుమిత్రులతో కాసేపైనా సరదా కబుర్లకు దారేదీ? అనుకునే వారందరికీ కార్తీక మాసం ఓ మంచి ఉపశమనం కుటుంబ సభ్యులు, పాత మిత్రులంతా సముద్ర తీరంలో కూర్చుని సేద తీరుతుంటే.. ఏ జలపాతం అందాలనో ఆస్వాదిస్తూ కబుర్లు చెప్పకుంటే ఆ ఆనందమే వేరు. ఆ ఆనందాన్ని తమకూ పంచమంటూ జిల్లాలోని పిక్‌నిక్ స్పాట్‌లు రారమ్మంటున్నాయి.. సముద్రతీరంలోని అందాలు పిలుస్తున్నాయి. ప్రశాంతతను కోరుకునే వారికి అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం ఆలయాలు ఆహ్వానం పలుకుతున్నాయి.

– ప్రజాశక్తి, శ్రీకాకుళం

జిల్లాలో 193 కిలోమీటర్ల సముద్రతీరం ఉంది. ఎన్నో బీచ్ స్పాట్‌లు వనభోజనాలకు అనుకూలంగా ఉన్నాయి. గార మండలం కళింగపట్నం బీచ్ జిల్లా కేంద్రా నికి 25 కిలోమీటర్ల దూరంలో, మొగదాలపాడు బీచ్ అదే దూరంలో ఉంటోంది. టెక్కలి దగ్గరలో భావనపాడు ఉంది. జిల్లా కేంద్రానికి 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. శ్రీకాకుళం పట్టణానికి అతి చేరువలో పెద్దగనగళ్లపేట, కుందువానిపేట సాగర తీరాలు కూడా పర్యాటకులను ఆకర్షిస్తాయి. ఇవి పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. సముద్ర తీరానికి కొంత దూరంలో ఉన్న సరుగుడు తోటలు వనభోజనాలకు అనుకూలంగా ఉన్నాయి.

మహేంద్రగిరి

400 శతాబ్దంలో చోళ్లుల హయాంలో మహేంద్రగిరి కొండపై ఐదు ఆలయాలు నిర్మించారు. ఇతిహాసాల్లో పాండవులు వనవాసం చేసే సమయంలో ఏడాది పాటు ఈ కొండపై ఉన్నారని చరిత్ర చెప్తోంది. కుంతి, ధర్మారాజు, అర్జునుడు, నకులు, సహదేవులకు వేర్వేరుగా నాలుగు ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు కిలోమీటరున్నర ఎత్తులో భీముడు ఆలయం ఉంది. ఈ ఆలయాల్లో ఎటువంటి విగ్రహాలు ఉండవు. అక్కడ గిరిజనులే పూజార్లు వ్యవహరిస్తున్నారు. సూర్యోదయాన్ని కొండపై నుంచి చూడడం ఓ అద్భుతం.

మొగదలపాడు తీరం

మొగదలపాడు సముద్రతీరం పర్యాటకులకు ఎంతో కనువిందు చేస్తుంది. జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు వచ్చి, వనభోజనాలు చేస్తుంటారు. శ్రీకాకుళం పట్టణానికి సుమారు 18 కిలోమీటర్ల దూరంలో ఉంది.

అరసవల్లి

అరసవల్లిలో సూర్యనారాయణ స్వామి దేవాలయం ప్రపంచ ఖ్యాతి పొందినది. ఇది పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే. అరసవల్లి వద్దగల మామిడి తోటలు వనభోజనాలకు అనుకూలం. కళింగపట్నం తీరంలో ఉన్న లైట్‌హౌస్ మంచి పిక్నిక్ స్పాట్. అక్కడ విశాలమైన సముద్రతీరం ఎంతో అనువుగా ఉంటుంది. గతేడాది దీన్ని మరింతగా అభివృద్ధి చేశారు. అలాగే వంశ ధార నది సముద్రంలో కలిసే ప్రాంతం ఇక్కడే ఉంది. పట్టణానికి 25 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రదేశం ఉంది. ఆర్‌టిసి, ప్రయివేటు వాహనాలు ప్రయాణికులను తరలిస్తుంటారు.

శాలిహుండం

రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన బౌద్ధారామాల్లో ఒకటైన శాలిహుండం ఇక్కడే ఉంది. కొండపై నుంచి చూస్తే వంశధార పరవళ్లు కనువిందు చేస్తాయి. ఇక్కడ మ్యూజియం ఉంది. శ్రీకాకుళం పట్టణానికి సుమారు 19 కిలోమీటర్ల దూరంలో, గారకు ఒక కిలో మీటరు దూరంలో ఈ ఆరామం ఉంది. గంటకో ఆర్‌టిసి బస్సు నడుస్తోంది. ప్రయివేటు వాహన సదుపాయమూ కలదు.




గొట్టాబ్యారేజీ

హిరమండలం మండల కేంద్రానికి 2 కిలోమీటర్ల దూరంలో వంశధార నదిపై నిర్మించిన గొప్ప కట్టడం గొట్టాబ్యారేజీ. చుట్టూ ప్రకృతి పచ్చిక బయళ్లు, కొండలు రమణీయంగా కనిపిస్తాయి. హిరమండలం నుంచి పాతపట్నం వైపు వెళ్లే బస్సులు, ఆటోలు, ట్రక్కుల్లో అక్కడకు వెళ్లొచ్చు. విద్యార్థులకు విజ్ఞానం అందించడంతోపాటు, యువత, పెద్దలకు ఇదొక మంచి విహార కేంద్రంగా పేరుగాంచింది.



పాలపొంగుల పరవళ్లు



నింగిని తాకడానికి పోటీ పడుతున్నట్లు అనిపించే పర్వత పంక్తులు, రా.. రమ్మని సాదరంగా తలలు ఊపుతూ ఆహ్వానించే వృక్ష సంపద, ఆకాశగంగలా ప్రవహించే జలపాతం... అదే గండాహతి జలపాతం. 200 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతూ ఉంటుంది. శ్రీకాకుళం జిల్లాలోని పలాస నుంచి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని గండాహతి జలపాతం పర్యాటకులను ఇట్టే ఆకర్షిస్తోంది. ఇటు ఆంధ్ర, అటు ఒడిశా ప్రాంతాలకు చెందిన వేలాది మంది ఈ కార్తీకమాసంలో జలపాతాన్ని సందర్శిస్తున్నారు.

ఇలా వెళ్లాలి... పర్లాకిమిడి నుంచి కంట్రగడ, గోర్లైల మీదుగా 25 కిలోమీటర్లు బస్సులో వెళ్లాలి. అక్కడ నుంచి అరకిలో మీటరు దూరం నడవాలి. జీపులు, కార్లు, మోటారు వాహనాల్లో వెళ్లే వారు జలపాతం వరకూ వెళ్లొచ్చు. మెళియాపుట్టి మండలం గొప్పిలి గ్రామం నుంచి 10కిలోమీటర్ల దూరంలోనే ఈ జలపాతం ఉంది. పక్కా రోడ్డు సౌకర్యం ఉంది.

'మొంథా' తుపానుపై అప్రమత్తం

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

'మొంథా' తుపాను ముప్పు నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. ఈ తుపాను జిల్లాపై ఈ నెల 28, 29 తేదీల్లో తీవ్ర ప్రభావం చూపవచ్చని వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో శనివారం జిల్లాలోని ఆయా శాఖల ఉన్నతాధికారులతో శనివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తీవ్ర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిగా సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. జిల్లాలో ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తక్షణమే తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్‌లో 08942-240557 నంబరుతో కంట్రోల్ రూమ్ సిద్ధంగా ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నియోజకవర్గాల, మండలాల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని అన్ని శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు వరదల పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. ఈ అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో లైన్ డిపార్ట్‌మెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర విధుల్లో ఉన్న అధికారుల సెలవులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలు నదులు, చెరువులు, సాగునీటి కాలువల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు. అవసరమైతే ఆ ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా, మట్టి గోడలతో ఉన్న ఇళ్లను, శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను వెంటనే గుర్తించి, అందులో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు వంటి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూసేందుకు, బ్యాకప్ ఏర్పాట్లు సంసిద్ధంగా ఉంచాలని చెప్పారు. తుపానును ఎదుర్కొనేందుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



వరి పంట చుట్టూ అల్లిన చీరలు

కంచెపట్టు చీర

ప్రజాశక్తి- కవిటి

పంట పండించడమే కాదు దాన్ని కాపాడుకోవడమూ ఇప్పుడు రైతుకు సవాలుగా మారింది. వానలు, వడగాల్పులు, ఎండలు ప్రకృతి రైతును పరీక్షిస్తూనే ఉన్నాయి. దానికి తోడు పందులు, పక్షుల బెడదలు రైతు శ్రమను వృథా చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పంటను కాపాడటానికి ప్రగడపుట్టుగకు చెందిన రైతు బెందాళం వరం చేసిన ప్రయత్నం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. మండలంలోని పుటియాదల ప్రాంతంలో ఈ మధ్య పందుల దాడులు పెరిగి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికే తన వరి చేనులో పందుల దాడితో నష్టపోయిన వరం తన ఇంట్లో ఉన్న చీరలను కంచెలా అల్లుకుని పంట చుట్టూ వేసేశాడు. మనసుంటే మార్గం ఉంటుందన్న ఆలోచనను వరం ప్రత్యక్షంగా చేసి చూపిస్తే, పిల్ల గాలుల సవ్వడికి ఊగుతున్న చీరలు చూపరులకు చి'వరి'కి చీరే సింగారమాయె... అన్నట్టు కనిపిస్తోంది.

ఇంటి స్థలాల వివాదంపై ఉద్రిక్తత

పోలీసులు రంగప్రవేశం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఇంటి స్థలాలు వివాదంపై ధర్మపురంలో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ధర్మపురంలో గతంలో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఉన్నారు. అయితే ఈ ఇళ్ల స్థలం పట్టాలు అనధికారికంగా చేతులు మారాయి. డోకులపాడుకు చెందిన మడ్డు రామారావుకు గతంలో పట్టా ఇచ్చారు. అయితే పట్టాదారు వేరే ప్రాంతంలో ఉండడంతో ఆ స్థలాన్ని కాజేయడానికి కొంతమంది ప్రయత్నం చేశారు. అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఫేక్ డాక్యుమెంట్ సృష్టించి బైపల్లికి చెందిన వ్యక్తికి అమ్మినట్లుగా చెబుతున్నారు. దీనిపై గ్రామ పెద్దలు పంచాయితీ నడిచింది. ఆ స్థలాన్ని అనధికారికంగా రెల్ల గోవింద, దుగాన ముకుందరావు, రెల్ల ఢిల్లీరావులకు విక్రయించారు.



ప్రొక్లెయినర్‌ను అడ్డుకుంటున్న మహిళలు

కొనుగోలు చేసిన వ్యక్తులు ఆ స్థలంలో షెడ్ వేసుకున్నారు. ఈలోగా స్థలం వాస్తవ యజమాని మడ్డు రామారావు వద్ద నుంచి కొనుగోలు చేసిన బాహాడపల్లికి చెందిన రూపవతి భర్త గణపతిరావు తను కొన్న స్థలంలో వేసిన షెడ్ తీయాలని చెబుతూ వస్తున్నారు. ఎంతకీ షెడ్ తీయకపోవడంతో తనే ప్రొక్లెయినర్ తీసుకొచ్చి ఇంటి స్థలంలో వేసిన షెడ్‌ను తొలగించారు. దీనిపై అనధికారికంగా కొనుగోలు చేసిన ముగ్గురు వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వివాదంపై క్షేత్ర పరిశీలనకు ఎస్ఐ నిహార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రొక్లెయినర్ సీజ్ చేయడానికి పోలీసులు ప్రయత్నించగా, అడ్డు తగలడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు తమపై దౌర్జన్యానికి దిగారని రెల్ల నీలవేణి తదితరులు ఆరోపిస్తుంటే ప్రొక్లెయినర్ కింద పడిపోతారని భావించి మహిళలను బయటకు తీసామని ఎస్ఐ నిహార్ చెబుతున్నారు. విచారణ నిమిత్తం వచ్చిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం సరి కాదని ఎస్ఐ తెలిపారు. మహిళలు అనవసర రాద్ధాంతం సృష్టించి పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఎస్ఐ చెబుతున్నారు. ప్రొక్లెయినర్ సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుల్లో టెట్ గుబులు

● నోటిపికేషన్ జారీ ● విద్యాశాఖ తీరుపై ఆందోళన

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు టీచర్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) పరీక్ష తప్పనిసరిగ్గా ఉత్తీర్ణత సాధించాలని జాతీయ విద్యా మండలి చేసిన సూచనలను అమలు జేస్తూ... రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో గుబులు రేపుతుంది. టెట్ పరీక్షలో అర్హత సాధించని ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా తమ ఉద్యోగాన్ని వదిలివేయాల్సి ఉంటుందని ప్రభుత్వ విద్యాశాఖ చెప్పడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన కొద్ది రోజుల్లోనే జాతీయ విద్యా మండలి సుప్రీం తీర్పుని బలపరుస్తూ... ఆదేశాలు జారీచేయడం ఆదేశాలు జారీ చేసింది. ఆ కొద్ది రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వం టెట్ నోటిపికేషన్ జారీ చేయడం వంటి ఘటనలు పరిశీలిస్తే ఉపాధ్యాయుల మెడపై రాష్ట్ర విద్యాశాఖ కత్తిపెట్టిందని పలువురు భావిస్తున్నారు. ఈ నెల 24 నుంచి నవంబరు 23 వరకు ఫీజు చెల్లించాలని, నవంబరు 25 నుంచి ఆన్‌లైన్‌లో నమూనా పరీక్ష ఉంటుంది. డిసెంబరు 3 నుంచి హాల్‌టిక్కెట్లు జారీ చేస్తుంది. డిసెంబరు 10న నుంచి పరీక్షలు నిర్వహిస్తారు. రోజుకు రెండు పరీక్షలు చొప్పున నిర్వహిస్తామని నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఉపాధ్యాయులు ఆందోళన మొదలయ్యాయి. గడచిన పదేళ్లుగా నలుగుతున్న ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం త్వరితగతిన స్పందించి ఆదేశాలు అమలు జేయాలనే ఉత్సాహాన్ని ప్రదర్శించడంపై పలు సందేహాలను ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు. 2011కి ముందు ఉపాధ్యాయ వృత్తిలో చేరే ప్రతి ఉపాధ్యాయుడూ టెట్ పరీక్షలో అర్హత సాధించాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొనడంపై ఉపాధ్యాయుల్లో గుబులు రేగుతుంది. ఉద్యోగ విరమణకు మరో ఐదేళ్లు కాలపరిమితి ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష అర్హత తప్పనిసరి కాదని ఉత్తర్వుల్లో పేరొంటున్నారు. భవిష్యత్‌లో ఇంకా ఎటువంటి ఆదేశాలు జారీ అవుతాయో? తెలియక ఉద్యోగ విరమణకు దగ్గరిలో ఉన్న ఉపాధ్యాయులూ టెట్‌కు సిద్ధమవుతున్నారు. కాగా, 55 ఏండ్ల వయసు పైబడిన తమకు ఈ వయసులో పరీక్షలు ఏమిటనే వాదనను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తికి అవసరమైన అన్ని పరీక్షలు పూర్తి చేసి ఉద్యోగంలో చేరి దశాబ్దాలుగా వృత్తిలో కొనసాగుతున్న తమపై టెట్ పరీక్ష నిబంధనలు కక్షసాధింపు చర్యలని పలువురు ఉపాధ్యాయులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అనేక ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగస్తులు ఉన్నా... ఒక్క ఉపాధ్యాయులకే టెట్ పరీక్ష ఆంక్షలు విధించడంలో ప్రభుత్వ విద్యాశాఖ వైఖరి ఏమిటో అర్థం కాని, పరిస్థితి ఉందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఏదేమైనా రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ టెట్ పరీక్షపై తీసుకున్న నిర్ణయం ఉపాధ్యాయుల్లో గుబులు రేపుతుంది.

ఐక్యతా యాత్రలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జిల్లాలో నిర్వహించే 'సర్దార్ ఎ 150 యూనిటీ మార్చ్' (ఐక్యత యాత్ర)లో యువతతో సహా అందరూ భాగస్వాములు కావాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ కోరారు. కలెక్టరేట్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 6న మై భారత్ నేతృత్వంలో భారత ప్రభుత్వం చేపట్టిన 'సర్దార్ ఎ150 యూనిటీ మార్చ్'ను ప్రారంభించిందని అన్నారు. మంత్రిత్వశాఖ ఇచ్చిన లక్ష్యం మేరకు జిల్లాస్థాయిలో మూడు రోజుల పాదయాత్రలు ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలోని అన్ని జిల్లాలను కవర్ చేస్తూ 3 రోజుల పాటు పాదయాత్ర చేపడతారని అన్నారు. ఈ నెల 31న ఉదయం సూర్యమహల్ కూడలి నుంచి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆడిటోరియం వరకు మొదటి జిల్లా స్థాయి పాదయాత్ర ఉంటుందని అన్నారు. అనంతరం అంబేద్కర్ ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమం, సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు మాట్లాడుతూ దేశంలోని సంస్థానాలను విలీనం చేసి, బలమైన భారతదేశ నిర్మాణానికి పునాదులు వేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ జాతీయ గౌరవాన్ని పెంపొందించడానికి, యువతలో ఐక్యతా స్ఫూర్తిని బలోపేతం చేయడానికి స్మారక, భాగస్వామ్య కార్యక్రమాల ద్వారా రాష్ట్ర నిర్మాణంలో 'జన్ భాగీదారీ' అనే ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్లు, కార్యకలాపాలు https://mybharat.gov.in/pages/unity_march పోర్టల్ ద్వారా నిర్వహించబడుతున్నాయని, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న జెసి, ఎమ్మెల్యే

థర్మల్‌పై అంత రహస్యమెందుకో?

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

థర్మల్ పవర్ ప్లాంట్‌తో బ్రహ్మాండమైన అభివృద్ధి జరిగిపోతుందని, పరిశ్రమలు,ఉద్యోగాలు వస్తాయనే పాలకుల మాటలను జనం ఏ మాత్రం విశ్వసించడం లేదని ప్రభుత్వం వేస్తున్న అడుగులబట్టి తేటతెల్లమవుతోంది. బూర్జ-సరుబుజ్జిలి ప్రాంతంలో నిర్మించనున్న సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఇటీవల సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో రహస్యంగా డ్రోన్ సర్వే చేపట్టడం అందుకు అద్దంపడుతోంది. ప్రజలు, రైతులు సమక్షంలో చేయాల్సిన సర్వేను వెన్నెలవలసలోని నవోదయ విద్యాలయం లోపల నుంచి సర్వే చేయడం ప్రభుత్వ దాపరికతనాన్ని బట్టబయలు చేసింది. గుట్టుచప్పుడు కాకుండా భూముల సర్వే చేసి పని చక్కబెట్టుకోవాలని ప్రయత్నించిన ప్రభుత్వం గిరిజనులకు అడ్డంగా బుక్కైంది. ప్రజల అంగీకారం లేకుండా భూముల సర్వే జరపడం వెనుక ఆంతర్యమేమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రారంభంలోనే ఇంత రహస్యంగా వ్యవహరిస్తుంటే, థర్మల్ పవర్ ప్లాంట్‌తో అభివృద్ధి, ఉద్యోగాలు వస్తాయనే మాటల్లో ఎంత మోసం ఉందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. థర్మల్ పవర్ ప్లాంట్లతో ఎంతటి వినాశకరమో తెలిసినా అభివృద్ధి జరిగిపోతుందంటూ ప్రచారం చేయడం పాలకులకు పరిపాటిగా మారింది. బూర్జ-సరుబుజ్జిలిలో ప్రతిపాదిత థర్మల్ పవర్ ప్లాంట్‌పై ఎమ్మెల్యే కూన రవి కుమార్, నియోజకవర్గ టిడిపి నేతలు అదే అభివృద్ధి పల్లవి అందుకున్నారు. పరిశ్రమలతోనే అభివృద్ధి సాధ్యమంటూ బాబు పాఠాలను వల్లె వేస్తున్నారు. పాలకులు తమ ప్రయోజనాల కోసం తీసుకొచ్చే కాలుష్య కారక ప్రాజెక్టులు, పోర్టుల కోసం ప్రజలను ఒప్పించేందుకు రకరకాల విన్యాసాలు చేయడం పాలకుల నైజం. ప్రాజెక్టు వస్తే యువతకు ఉద్యోగాలు వస్తాయని భ్రమలు కల్పించడం, ప్రాజెక్టులతో ఆ ప్రాంతం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందిపోతుందని అరచేతిలో వైకుంఠం చూపించడం పాలకులకు వెన్నతో పెట్టిన విద్య.

బూర్జ-సరుబుజ్జిలి ప్రాంతంలో ప్రతిపాదిత థర్మల్ పవర్ ప్లాంట్ విషయంలో ఎమ్మెల్యే కూన రవికుమార్, ఆయన అనుచరులు ప్రస్తుతం వివిధ రకాల వేదికలపై అవే మాటలు చెప్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. థర్మల్ పవర్ ప్లాంట్లతో ఏం ఉద్యోగాలు వస్తాయో, వాటి ఏర్పాటుతో ఏం అభివృద్ధి చెందిపోతుందో సోంపేట, కాకరాపల్లి పవర్ ప్లాంట్లకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలు తేటతెల్లం చేస్తున్నాయి. చిత్తడి నేలలు, పర్యావరణాన్ని నాశనం చేసే థర్మల్ ప్లాంట్ వద్దంటూ ప్రజలు పెద్ద ఉద్యమమే సాగించారు. ప్రజలపై బలవంతంగా థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రజలపై రుద్దటానికి నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. ప్లాంట్ వద్దన్నందుకు కాల్పులు నిర్వహించి అమాయకులైన ముగ్గురి ప్రాణాలను పొట్టన పెట్టుకుంది. పట్టువీడకుండా ప్రజలు సాగించిన ఆందోళనలకు దిగొచ్చిన ప్రభుత్వం ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకుంది. సంతబొమ్మాళి మండలం కాకరాపల్లిలోనూ అదే తరహాలో పోరాటం సాగింది. ఇక్కడా ప్రభుత్వం కాల్పులకు తెగబడి ముగ్గురిని బలితీసుకుంది. కాకరపల్లి థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో ఉద్యోగాలు వస్తాయంటూ, ఆ ప్రాంతం అభివృద్ధి చెందిపోతుందంటూ నాడు ఎమ్మెల్యేగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు నమ్మబలికారు. ఆయనపై నమ్మకంతో పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం రైతులు తమ పచ్చని పంట భూములను ఇచ్చారు. తర్వాత బ్యాంకులకు రుణాలు చెల్లించలేక ప్లాంట్ దివాలా తీయడంతో ఉత్పత్తి లేదు, ఉద్యోగాలు లేవు. పైగా 2 వేల ఎకరాల్లో నిర్మించిన ప్లాంట్‌ను బ్యాంకుల వేలంలో ఓ ప్రైవేట్ కంపెనీ కారు చౌకగా దక్కించుకుంది. థర్మల్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు ఎంతటి వినాశకరమో అనకాపల్లి జిల్లా పరవాడ మండల స్వయంభూవరం ప్రాంతంలో రెండు వేల మెగా వాట్ల సామర్థ్యంతో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన విద్యుత్ ప్లాంట్‌తో గ్రామస్తులు పడుతున్న ప్రత్యక్షనరకమే ఒక ఉదాహరణ. తీవ్ర కాలుష్యం, జబ్బులు, తాగడానికి పనికిరాని నీళ్ల వంటి సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీటిని విస్మరించి ఉద్యోగాలు, అభివృద్ధి పేరుతో ప్రజల్లో భ్రమలు కల్పించడం వారిని మోసగించడమే అవుతుంది.

ఆమదాలవలస నియోజకవర్గ ప్రజలకు నిజంగా మేలు చేయదలుచుకుంటే ఎమ్మెల్యే కూన రవికుమార్ సుగర్ ఫ్యాక్టరీని తెరిపించి ప్రత్యక్షంగా రెండు వేల మందికి, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి కల్పించొచ్చు. చక్కెర పరిశ్రమను తెరిపిస్తే ఆ ప్రాంతంలో మార్కెంటింగ్, ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశాలూ లేకపోలేదు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాదిన్నర గడచినా దానిని తెరిపించేందుకు వీసమెత్తు ప్రయత్నం చేయని ఆయన ప్రజలకు, పర్యావరణానికి నష్టం చేసే థర్మల్ పవర్ ప్లాంట్‌పై ఎందుకంత ప్రేమ అని ప్రజలు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. 2014-19 టిడిపి హయాంలో జైనా నిధులతో చేపట్టిన నారాయణపురం ఆనకట్ట ఏడేళ్లు అవుతున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. వంశధార-నాగావళి నదుల అనుసంధాన పనులు టిడిపి హయాంలో 2017లో పనులు మొదలైనా ఇప్పటికీ పూర్తి కాలేదు. వీటిని పూర్తి చేస్తే రెండు పంటలకు సాగునీరందుతుంది. రైతుల ఆదాయం పెరిగితే కొనుగోలు శక్తి పెరుగుతుంది. తద్వారా కొత్త పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయి. అభివృద్ధి అంటే ఇది కదా. వీటిని విస్మరించి థర్మల్ పవర్ ప్లాంట్‌ను కొత్తగా తెరపైకి ఎందుకు తీసుకొచ్చారన్న సందేహాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో ఏమైనా హామీ ఇచ్చారా? అంటే అదీ లేదు. ఏం ప్రయోజనాలు ఆశించి తీసుకొచ్చారోనని అంతా అనుకుంటున్నారు.

ఇన్ఫోసిస్‌లో మెరిసిన 'ఐతమ్' విద్యార్థులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి అదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ విద్యార్థులు తమ ప్రతిభతో మరోసారి కీర్తి సాధించారు. ప్రముఖ ఐటి సంస్థ ఇన్ఫోసిస్ లిమిటెడ్ నిర్వహించిన 2026 బ్యాచ్ ప్రాంగణ నియామకాల్లో ఈ కళాశాలకు చెందిన పలు విభాగాలకు చెందిన 117 మంది విద్యార్థులు అర్హత సాధించి ఉద్యోగ అవకాశాలు పొందారు. ఎంపికైన వారికి రూ. 3.6 లక్షల ప్రారంభ వార్షిక వేతనం లభించనుందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఇన్ఫోసిస్ వంటి జాతీయ స్థాయి సంస్థలో ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఏకకాలంలో ఎంపిక కావడం ఐతమ్ విద్యా ప్రమాణాలు, శిక్షణా విధానాలు, అధ్యాపకుల అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ విజయం విద్యార్థుల కృషి, సాంకేతిక నైపుణ్యం, వ్యక్తిత్వాభివృద్ధి శిక్షణ ఫలితమని అన్నారు. ఇది విద్యార్థుల కెరీర్‌లో బలమైన మొదటి అడుగు అవుతుందన్నారు. ఈ నియామక విజయానికి ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ ఎం.సంతోష్‌కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ హెడ్ డాక్టర్ వి.వి.వి.ఎస్.ఎస్.పి.ఎస్.శ్రీకాంత్‌లు కీలక పాత్ర పోషించారు. కోడింగ్ వర్క్‌షాప్‌లు, సమూహ చర్చలు, అభ్యాస ఇంటర్వ్యూ సెషన్‌లు వంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల విజయానికి దోహదపడ్డాయని కొనియాడారు.

అబ్దుల్ కలాం అవార్డుకు చిరంజీవిరావు ఎంపిక

ప్రజాశక్తి- ఎచ్చెర్ల


చిరంజీవిరావు

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పలివెల చిరంజీవిరావుకు డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభ అవార్డు 2025 లభించింది. ప్రస్తుతం ఆర్‌జియుకెటి తెలుగుశాఖ అధ్యక్షులుగా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టరేట్ చేసి డాక్టర్ కామేశ్వరి దేవి గోల్డ్ మెడల్ 2018 అందుకున్నారు. ఎంఎ, టిపిటి, ఎంఫిల్, పిహెచ్‌డి విద్యను అభ్యసించారు. విద్యారంగంలో ఆయన అందించిన విశేష సేవలకు, విద్యార్థులకు మానవీయ విలువలను బోధించినందుకు విద్యార్థులు ఇచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కలాం జయంతిని పురస్కరించుకుని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవ దినోత్సవం సందర్భంగా గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో 26న జరిగే సభలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.


కోతకు గురవుతున్న రోడ్డు

కోతకు గురవుతున్న రోడ్లు

మెళియాపుట్టి: మండలంలో ఇటీవల పడిన వర్షాలకు పలుచోట్ల రోడ్లు కోతకు గురై ఆర్ అండ్ బి రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో రోడ్ల అంచులు కోతకు గురవుతున్నాయి. పట్టుపురం సమీపంలో ఆఫ్‌షోర్ కెనాల్ వద్ద కెనాల్ లోని నీరు అధికమై రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ఇక్కడ రోడ్ కోతకు గురైంది. చాపర జీడి పరిశ్రమల వద్ద ఇదే దుస్థితి ఏర్పడింది. రోడ్డుపై రాళ్లు తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చేపర హైస్కూల్ వద్ద రోడ్డు గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మెళియాపుట్టి, వసుంధర మధ్య రోడ్డు గుంతలు ఏర్పడ్డాయి. అలాగే వర్షాలకు గోపీనాథపురం కల్వర్టు వద్ద గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గోకర్ణపురం సమీపంలోని గెయిల్ కంపెనీ వద్ద రోడ్డు పాడయింది. చాపర జీడి పరిశ్రమ కల్వర్టు వద్ద రంధ్రాలు ఏర్పడి ప్రమాదంగా మారాయి. ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు వాహనదారులు ప్రయాణికులు కోరుతున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

తాడేపల్లి ప్యాలెస్‌లోనే కల్తీ మద్యం ఫార్ములా

శ్రీకాకుళం సిటీ, రూరల్: తమ అవినీతి, అక్రమాలను, పాపాలను ఎదుటి వారిపై నెట్టడంలో జగన్ అండ్ కో ఆరితేరారని, తాడేపల్లి ప్యాలెస్‌లోనే కల్తీ మద్యం ఫార్ములా నడిపించారని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆరోపించారు. స్థానిక విశాఖ ఎ.కాలనీలో శనివారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి నాయకులు, కూటమి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కుట్రలు చేస్తున్నారని అన్నారు. గత ఐదేళ్లు లిక్కర్ మాఫియా నడిపి రూ.3500 కోట్లు దోచుకున్న విషయాన్ని ప్రజల దృష్టి మళ్లించడానికి జగన్ కుట్రలకు ప్లాన్ చేశారని అన్నారు. అందులో భాగంగానే చిత్తూరు జిల్లా ములకల చెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ మద్య కుంభకోణంతో, కూటమి ప్రభుత్వం ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే కుట్రపూరితంగా కల్తీ మద్యం ఫార్ములాను తాడేపల్లి ప్యాలెస్‌లో తయారు చేశారన్నారు. సెప్టెంబరు 24న ఆఫ్రికాకు వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్న జనార్థనరావును 23న జోగి రమేష్‌ను ఇంటికి పిలిపించుకుని, నకిలీ మద్యానికి పక్కా ప్రణాళికలు రచించారని అన్నారు. జోగి రమేష్ అనుచరుడు సురేష్ మొలకల చెరువు కల్తీ మద్యం తయారీ కేంద్రం ఆచూకీ ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేసి, కుట్రను కూటమి ప్రభుత్వంపై ఆపాదించేందుకు ప్రయత్నించారన్నారు. గత ప్రభుత్వంలో మద్యం తయారీ కంపెనీలన్నింటినీ జగన్ గుప్పిట్లో పెట్టుకొని జే బ్రాండ్లు మాత్రమే తయారు చేసి, రాష్ట్రంలో 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. గత ఐదేళ్లు సరఫరా చేసి జే బ్రాండ్లలో విషపూరిత పదార్థాలు ఉన్నట్లు చెన్నై, బెంగళూరు, అమెరికా ల్యాబ్‌లు స్పష్టం చేశాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం బెల్ట్ షాపులకు చెక్ పెట్టిందని, బెల్ట్ షాపులు నడిపిన వారిపై రూ.5 లక్షల జరిమానా విధించి, కఠిన చర్యలు తీసుకోవడం తీసుకుంటుందని తెలిపారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు. టిడిపి నాయకులు పి.ఎం.జె.బాబు, పాండ్రంకి శంకర్, పంచిరెడ్డి అప్పనాయుడు, పిరియా మాధవి పాల్గొన్నారు.

గురుకులాల్లో పురుష ఉపాధ్యాయులు వద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులు వద్దని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు శనివారం దళిత ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మైనర్ బాలికలపై వరుస జరుగుతున్న అఘాయిత్యాలు, దాడుల నేపథ్యంలో పురుష ఉపాధ్యాయులను బాలికల గురుకులాల్లో నియమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాలికల గురుకులాల్లో పురుష ఉద్యోగులు ఉండరాదని జువైనల్ కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అంబేద్కర్ గురుకులాల సొసైటీ కార్యదర్శి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత ఆదివాసీ ప్రజా సంఘాల జెఎసి జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా నాయకులు అప్పారావు పాల్గొన్నారు.


ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

చట్టాలపై అవగాహన అవసరం


పొందూరు : న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొన్న జడ్జి జ్యోత్స్న

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి బి.రమ్య మాట్లాడుతూ పోక్సో చట్టం 2012లో లైంగిక నేరాల నుంచి చిన్నారులను రక్షించేందుకు రూపొందించబడిందని తెలిపారు. 18 ఏళ్లలోపు బాలికలు ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై బాధ్యతగా పర్యవేక్షణ చేయాలని, పోక్సో కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు వరకు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కణితి విజయలక్ష్మి, అన్నెపు సత్యనారాయణ, బొడ్డేపల్లి మోహనరావు, చింతాడ సత్యం, అన్నం నాయుడు, పి.వి.నరసింహులు, బూర్లె సీతారాం, ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్, జాతీయ సేవాపథకం అధికారి జె.రవిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మండల న్యాయసేవా సంఘం చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బి.జోత్స్న అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయ వాదులు కె.అశోక్, ఎం.రాము, వసతిగృహం అధికారి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: లైంగిక నేరాలపై పిల్లలు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల సూచించారు. నిందిగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మహిళల కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లఖినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి ఆదేశాలు మేరకు శనివారం కెజిబివిలో విద్యార్థులకు, మహిళలకు


ఆమదాలవలస : మాట్లాడుతున్న జడ్జి రమ్య

సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది వి.అప్పలనాయుడు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పనిచేసే చోట ఉండే అవిరోధాలను ధైర్యంగా ఎదిరించాలని జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో తహశీల్దార్ వెంకటరావు, సిఐ మీసాల చిన్నంనాయుడు, కమిషనర్ రమేష్, ఉలాల భారతీ దివ్య, ప్రేమలత, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, ఎం. రాంబాబు, నారాయణ, ఐసిడిఎస్ పిఒ రాజేశ్వరి పాల్గొన్నారు.

కొత్తూరు : తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.అప్పారావు అధ్యక్షతన కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందితో న్యాయ విజ్ఞాన సదస్సు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కందికట్ల రాణి నిర్వహించారు. న్యాయవాదులు గేదెల ఫాల్గొనరావు, ధర్మారావు, రాడ రాజు, సుధాకర్, ఉమామహేశ్వరరావు, హరిబాబు, ప్రసాద్, సిఐ ప్రసాద్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వై.జోగారావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బి.సుదర్శన్ పాల్గొన్నారు.


దీక్ష చేస్తున్న కార్మికులు

కొనసాగుతున్న నిరవధిక సమ్మె

ప్రజాశక్తి- మందస

సత్యసాయి కాష్యూ పరిశ్రమ తెరిపించాలి, కార్మికులకు ఉపాధి కల్పించాలని జీడి కార్మికుల సమ్మె శనివారం కొనసాగింది. డిమాండ్లు పరిష్కరించే వరకూ నిరసన దీక్ష కొనసాగుతుందని జీడి కార్మికులు స్పష్టం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కె.కేశవరావు సోమవారం నుంచి దాశల వారీ ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. జీడి సంఘం నాయకులు డి.మీన, డి.భారతి, బి.వరలక్ష్మి, కె.వరలక్ష్మి, టి.కుమారి పాల్గొన్నారు.


చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- అరసవల్లి

ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్య నారాయణ స్వామిని శనివారం హైకోర్టు జడ్జిలు సుబ్బారెడ్డి సత్తి, తుహిన్ కుమార్ గేదెల శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఇఒ కె.ఎన్.డి.వి.ప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ ఆశీర్వదించారు. అనంతరం స్వామివారి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు.


అభినందిస్తున్న కళాశాల యజమాన్యం

ఉపాధ్యాయునికి అభినందనలు

సోంపేట: స్థానిక సంస్కార భారతి విద్యాసంస్థల్లో ఉపాధ్యాయునిగా పనిచేసి ఇటీవల డిఎస్‌సిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికైన పి.సురేంద్రబాబును కళాశాల యజమాన్యం అభినందించింది.ఈ మేరకు శనివారం కళాశాలకు వచ్చిన సురేంద్రబాబును కరస్పాండెంట్ దాసు, అధ్యాపక బృందం సభ్యులు అభినందనలు తెలియజేశారు. కష్టపడితే విజయం సాధించవచ్చు అనడానికి సురేంద్రబాబు నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీకాంత్

భూ వివాదంపై పంచాయితీ

ప్రజాశక్తి- మందస

మండలంలోని కొండల్లోగా పంచాయతీ చాపరాయి భూ వివాదాలపై కొద్ది రోజులుగా గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య గత కొద్ది రోజులుగా భూములు వ్యవహారం తేలకపోవడంతో తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. తహశీల్దార్ శ్రీకాంత్ తహశీల్దార్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. 152లోని భూమి 15 ఎకరాలు బిడిఆర్‌లో 92 సర్వే నంబర్ల ఉన్న భూమి జిరాయితీలో కొంత కూడా ఉందని అన్నారు. ఇటు సుదర్శన్ మాకు ఆరేళ్ల కింద బిసిల దగ్గర నుంచే మేము భూమి కొన్నామని, ఆ కొన్న లింక్ డాక్యుమెంట్లతో సహా మా దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నాయని తహశీల్దార్‌కు వివరించారు. గిరిజనులకు మీరు సాగు చేస్తున్న డికెఆర్ పట్టాలాంటివి, ఎటువంటి ఆధారాలున్నా చూపించాలని తహశీల్దార్ కోరారు. వాళ్ల దగ్గర ఏ ఆధారం లేకపోవడంతో ఆ గ్రామస్తులు కొంతమంది అప్పట్లో సర్వే చేసి ఇచ్చిన సాగు భూమిగా మార్చి వాటి ఫలాలు అనుభవిస్తున్నారు తప్ప వాళ్ల దగ్గర ఎటువంటి ఆధారాలు లేవని చెప్పారు. ఇది ఎక్కడితో తేలే వ్యవహారం కాదని, ఈ వ్యవహారం కాస్త ఎస్‌హెచ్‌ఒకు పంపి ఆధారాలు తెప్పించుకొని ఇందులో ఆక్రమదారులు, సూత్రధారులు, పాత్రదారులు ఎవరో గురువారం నిగ్గు తేలుస్తామని ఇరు తరగతులను నచ్చజెప్పారు.

నాణ్యమైన మద్యం సరఫరా లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎపి సురక్ష యాప్ ద్వారా కల్తీ మద్యాన్ని కట్టడి చేయవచ్చునని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. నగరంలోని మద్యం దుకాణాన్ని సందర్శించి ప్లేస్టోర్ ద్వారా ఎపి సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసుకుని మద్యం బాటిళ్లపైన ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి మద్యం నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి కల్తీ జరిగిందో లేదా తెలుసు కోవచ్చున్నారు. మద్యం వినియోగదారులు ఈ సురక్ష యాప్‌ను వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కల్తీమద్యం ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయని వినియో గదారులు అప్రమత్తంగా ఉండి మద్యం కల్తీని తెలు సుకోవాలన్నారు.


మద్యం దుకాణం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అలాగే నగర పరిధి స్థానిక దండి వీధిలో శ్రీరామ మందిరం నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణం ప్రారంభించారు.


మరమ్మతులకు గురైన వాటర్‌ప్లాంట్

వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయించాలి

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పైడిభీమవరం పంచాయతీ చిల్లపేటలో పైడిభీమవరం పారిశ్రామిక వాడలో ఉన్న అఫిటోరియా ఫార్మా ప్రైవేటు లిమిటెడ్ (అరబిందో) రూ.లక్షలు వెచ్చించి వాటర్ ప్లాంట్‌ను గతంలో ఏర్పాటు చేసింది. కొన్నేళ్ల క్రితం దానిని పంచాయతీకి అప్పగించింది. అయితే కొద్ది నెలల క్రితం వాటర్ ప్లాంట్‌లోని పనిముట్లు చెడిపోవడంతో దానిని బాగు చేయించకుండా మూసివేశారు. దీంతో ప్రజలు తాగడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిరుపయోగంగా ఉండటంతో రూ.లక్షల విలువైన యంత్రాలు సైతం దెబ్బతినే ప్రమాదముందని, దానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. తాగునీటికి ఇబ్బంది పడుతున్న విషయం తెలుసు కున్న పైడి భీమవరం జనసేన నాయకులు, శ్రీకాకుళం జిల్లా జనసేన కార్యదర్శి వడ్డాది శ్రీనివాసరావు సందర్శించి కంపెనీ యాజమాన్యానికి తెలియపరచడంతో త్వరలో మరమ్మతులు చేస్తామని చెప్పడం జరిగిందని చిల్లపేట గ్రామస్తులకు తెలిపారు.

పరిశ్రమలతో అభివృద్ధి

సరుబుజ్జిలి: వెన్నెలవలస సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం జెన్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌పై కొంతమంది చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు ఆధ్వర్యంలో విలేకరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ ప్రాజెక్టు వలన జిల్లాలోని అనేకమంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, అలాగే బూర్జ, ఆమదాలవలస, సరుబుజ్జిలి పరిసర ప్రాంతాలు పరిశ్రమలతో అభివృద్ధి


మాట్లాడుతున్న డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ

చెందుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా తూర్పుకాపు సాధికార డైరెక్టర్ పల్లి సురేష్, నియోజకవర్గ తెలుగు యువత నాయకుడు తాడేల రాజారావు, టిడిపి నాయకులు కందుల వెంకట్రావు, ఎండి రామారావు, కొమనాపల్లి రవికుమార్, కె.గణపతిరావు, జి.చిన్నబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎచ్చెర్లలోని ఆర్మ్డ్‌రిజర్వ్ విభాగం పోలీస్ ఫంక్షన్‌హాల్‌లో ఆర్మ్డ్‌రిజర్వ్ డిఎస్‌పి శేషాద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఎచ్చెర్ల అంబేద్కర్ గురుకులం పాఠశాల విద్యార్థులకు 'లైంగిక నేరాల నుంచి మహిళలు, పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. అలాగే ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కేశవరావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ సందీప్ హెచ్‌సి సరిత పోలీసుల విధులు, ఆయుధాల వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పారుపల్లి శ్రీనివాసరావు, కల్యాణి, పద్మజ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణ పోలీసుల ఆధ్వర్యాన మహిళా కాలేజీలో వ్యవస రచన, వ్యక్తిత్వ పోటీలు శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నవ్యశ్రీ మహంతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్సులు, రైళ్లు, విద్యా సంస్థలు, పార్కులు, సినిమా హాళ్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో మహిళలు ఇబ్బందులకు గురైతే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌సి వల్లభరావు, కానిస్టేబుల్ గిరిబాబు, ఎఎస్ఐ ప్రియా, సుధాకర్, ఎన్.ఎస్.ఎస్. పి.పి.ఎస్.రజనీకుమారి, అధ్యాపకులు బి.కరుణాకరరావు, పి.ప్రసాదరావు, సునీత, లత, యుగంధర పాల్గొన్నారు.

ఎల్ హెచ్‌ఎంఎస్‌పై విద్యార్థులకు అవగాహన

పొందూరు: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెచ్‌సి రమణ ఆధ్వర్యంలో లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటికి తాళం వేసి దూర ప్రాంతాలకు వెళ్లి రెండు, మూడు రోజులు ఉండే వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించే ఇళ్లపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవరైనా అపరిచితులు ఇంటి తాళం తీస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అలారం మోగుతుందన్నారు. వెంటనే పోలీసులు అప్రమత్తం అవ్వడం జరుగుతుందని తెలిపారు. దీనిపై అవగాహన కలిగేలా విద్యార్థులకు వీడియో ద్వారా టీవీలో ప్రదర్శించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: అమరవీరుల స్మారక వారోత్సవాల సందర్భంగా టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న పలు పాఠశాలలు, కళాశాలల్లో పోలీస్ సంబంధిత లఘు చిత్రాల ప్రదర్శనలు నిర్వహించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను తెలియజేశారు. యువతలో దేశభక్తి, సేవా స్ఫూర్తిని పెంపొందించడమే ఈ ప్రదర్శనల ప్రధాన ఉద్దేశ్యమని పోలీసు అధికారులు తెలిపారు.

కాలుష్యకోరల్లో నాగావళి


చెత్తా చెదారంతో నిండి ఉన్న నాగావళి నదీతీర ప్రాంతం

ప్రజాశక్తి- అరసవల్లి

నగరంలోని నాగావళి నదీ తీరం వద్ద ఉన్న ఉమా రుద్ర కోటేశ్వర ఆలయం వద్ద ఉన్న మెట్ల మార్గం అపరిశుభ్రతగా ఉండటమే కాకుండా, మద్యం సీసాలు, పాలథీన్ కవర్లుతో నిండిపోయి నది వద్ద కాలు పెట్టలేని దుస్థితి నెలకొంది. పూజలు చేసిన తరువాత కొందరు ఆ ద్రవ్యాలను, ప్లాస్టిక్ కవర్లను నాగావళి నదిలో కలపడం వలన, ఆ నీటిని కలుషితం చేస్తున్నారని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఏడురోడ్ల జంక్షన్, పాత వంతెన పైనుంచి చాలామంది పూజా సామగ్రిని పాలథిన్ కవర్లతో పడేయడంతో నాగావళి నదిఒడ్డున చెత్తాచెదారంతో నిండి ఇబ్బందికరంగా మారింది. ప్రసిద్ధి చెందిన నగరాల్లో ప్రతి ఆలయం వద్ద ఉన్న నదీ పరివాహక ప్రాంతాల్లో కార్తీక మాసంలో మహిళలకు నదిలో దీపారాధన చేయటానికి ఎంతో సౌకర్యంగా ఏర్పాటు చేస్తారు. అయితే నగరంలో ఉన్న ఉమా రుద్ర కోటేశ్వరాలయం పరిసరాల్లో పశువులు, కుక్కలు సైర్య విహారం చేస్తూ అపరిశుభ్ర వాతావరణం ఎక్కువగా కనబడుతుంది. ఆలయ సిబ్బంది గాని, మున్సిపల్ సిబ్బంది గాని ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కార్తీకమాసం ఉమా రుద్రకోటేశ్వరాలయ మెట్ల దారిలో నదికి వెళ్లడానికి ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి ఎదురవుతుంది. ఏమాత్రం పరిశుభ్రత లేకుండా ఆలయ మెట్లవద్దే మలమూత్ర విసర్జన నిత్యకృత్యమైంది. ఆలయానికి వచ్చిన వారు తీసుకొచ్చిన పాలథిన్ సంచులు కూడా మెట్ల వద్ద ఉన్న ప్రాంతంలోనే కలపడంతో నాగావళి పరిసరాలు అసహ్యంగా కనపడుతున్నాయి. ఇదిలా ఉండగా రహస్య మార్గంగా ఉన్న మెట్ల మార్గంలోనూ మద్యం సీసాలు ఎక్కువగా దర్శనమిస్తుంటాయి. దీనికి కారణం చాలామంది మద్యం సేవించేవారు మెట్ల వద్ద చాటుమాటుగా ఉంటుందని, మద్యాన్ని సేవించి మద్యం సీసాలను అక్కడే పడేస్తున్నారు.


అధ్వానంగా ఉన్న నాగావళి నది పరసరాలు

ఈ అపరిశుభ్రతపై ఆలయ ఇఒ మునగవలస సుకన్యను ప్రశ్నించగా తాము ఈ సమస్యపై అనేకసార్లు నగరపాలక సంస్థకు ఫిర్యాదు చేశామని, అయినా సరైన చర్యలు తీసుకోవడం లేదని, పశువులు రాకుండా చర్యలు తీసుకుంటున్నా మరలా యథాస్థితిగా వస్తున్నాయన్నారు. అదే విధంగా ఆలయ వ్యర్థాలను పారవేయడానికి ఎప్పటికప్పుడు ఒక డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థకు విజ్ఞప్తి చేశామని, త్వరలో అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కూడా నదిలోకి వెళ్లి స్వచంద సంస్థలతో కలిసి స్వచ్ఛా ఆంధ్ర పేరిట కార్యక్రమం నిర్వహించారు. శాశ్వత పరిష్కారం మాత్రం ఎవరూ చూపకపోవడంతో నాగావళి నది జలాలు కలుషితం ఎక్కువైంది.


వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి వివేకానంద

పోక్సో కేసులో ఇద్దరు అరెస్టు

తల్లి, ఆటో డ్రైవర్‌లకు రిమాండ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రణస్థలం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సోకేసులో నిందితుడు పిన్నింటి రామారావు అనే ఆటో డ్రైవర్‌ను, ప్రోత్సహించిన బాలిక తల్లిని అరెస్టుచేసి కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు శ్రీకాకుళం డిఎస్‌పి వివేకానంద చెప్పారు. డిఎస్‌పి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. తల్లిని లోబర్చుకొని, మద్యానికి బానిగా మార్చి, ఆమె ప్రోత్సాహంతో 14 ఏళ్ల 9వ తరగతి బాలికపై గత కొన్నినెలలగా లైంగిక దాడి చేస్తుండడంతో కుంటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తు చేసి నిందితులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. తల్లి పాత్ర ఉండడం వల్ల కొన్ని నెలల పాటు బాలికపై లైంగిక దాడి జరిగిందని తెలిపారు. బాలిక చిన్నాన్న చొరవతో ఫిర్యాదు చేయడంతో ఈ ఘోరం బయిట పడిందన్నారు. మైనర్ బాలికలపై, మహిళలపై దాడులు చేస్తున్నవారిపై కఠినంగా పోలీస్‌శాఖ వ్యవహరిస్తుందన్నారు. మహిళల్లో నారీ శక్తి యాప్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సిఐ అవతారం, ఎస్ఐ చిరంజీవి పాల్గొన్నారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక అధికారులు

నాలుగు ఇళ్లు దగ్ధం

ప్రజాశక్తి- మందస

మండలంలోని బుడర్సింగి పంచాయతీ పద్మాపురం కాలనీలో శనివారం నాలుగు ఇళ్లు కాలి బూడిదయ్యాయి. గ్రామంలో అందరూ పొలం పనులకు వెళ్లడంతో ఎవరూ లేరు. ఊర్లో నుంచి దట్టమైన పొగలు రావడంతో గ్రామస్తులు పరుగున గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేస్తూ... అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సవర లాలూ సవర ఉదవ్ సలోకు, సవర డిల్లీ, సవర నోబిన్ ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. విద్యుత్ మీటర్లు, ఆధార్, రేషన్ కార్డులు, ఎల్‌పిసి బాండ్లు కాలిపోయాయి. అగ్నిమాపక అధికారులు ఆస్తినష్టం అంచనా వేశారు.


మాట్లాడుతున్న కృష్ణచైతన్య

ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

ఈ నెల 28వ తేదీన నరసన్నపేట పట్టణం నిర్వహించనున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య కోరారు. ఈ మేరకు శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ 17 మెడికల్ కాలేజీల శ్రీకారం చుడితే వాటిని ప్రైవేటీకరణ చేసి సొమ్ము చేసుకోవాలనుకోవడం దారుణమని అన్నారు. చంద్రబాబు తన రాజకీయ జీవితంలో పేదల కోసం ఆలోచన చేసిన సందర్భం ఒక్కటీ లేదని గుర్తు చేశారు. ఎంపిపిలు, జెడ్‌పిటిసి, నాయకులు పాల్గొన్నారు.

సోంపేట : ర్యాలీ పోస్టర్‌ను ఎంపిపి నిమ్మన దాసు ఆవిష్కరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు పిపిపి విధానం ద్వారా ప్రైవేట్‌వ్యక్తులకు అప్పగిస్తున్న సందర్భంగా దాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమం చేస్తున్నామన్నారు. వైసిపి మండల అధ్యక్షులు భాస్కరరావు, వైస్ ఎంపిపి గుర్రాల శ్రీను, పిన్నింటి రేఖారావు, పిన్నింటి ఈశ్వరరావు, దుమ్ము డిల్లీరావు, తామాడ బుజ్జి, దున్న మాధవరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దని, ప్రభుత్వమే నిర్వహించాలని వైసిపి నాయకులు ధర్మాన రామ్మోహార్ నాయుడు డిమాండ్ చేశారు. నగరంలో ప్రైవేటీకరణకు వ్యతిరేఖంగా శనివారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. మురళి, భరద్వాజ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

శ్రీకాకుళం : ఈ నెల 26న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పి.ఎన్. కాలనీ, బలగ, బలగ మెట్టు, జడ్జి బంగ్లా, పొడుగు నారాయణమ్మ కాలనీ, భావాజీతోట, ఆదివారంపేట, హోమియోనగర్, శాంతినగర్ కాలనీ, రైతుబజార్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తల్లికి కుమార్తె తలకొరివి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని తోట పూరుకు చెందిన కోనేటి పార్వతి (45) అనారోగ్యంతో బాధప డుతూ శనివారం మృతి చెందింది. భర్త భాస్కరరావు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించు కుంటు న్నాడు. కుమారుడు కిషోర్ మానసిక వైకల్యం కారణంగా కుమార్తె చోడిపిల్లి గౌరీ తన తల్లి దహన సంస్కారాలను దగ్గరుండి చేయించింది. తల్లి చితికి నిప్పంటించి కూతురుగా రుణం తీర్చుకుంది.


తల్లికి అంతిమ సంస్కారం నిర్వహిస్తున్న గౌరీ

పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి- సీతంపేట

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. శనివారం ఆయన స్థానిక బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని తిని, రుచిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పెడుతున్న భోజనం మరింత రుచికరంగా ఉండాలని, శుభ్రతతో ఉండాలని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ నీలం నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - భామిని

సంక్షేమం, అభివృద్ధి రెండు కల్లుగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై, భామిని మండలం సోషల్ మీడియా గ్రూపులో కూటమి ప్రభుత్వంపై ఎమ్మెల్యే జయకృష్ణపై తీవ్రస్థాయిలో దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ అంశం పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు నివేదిస్తామని టిడిపి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవినాయుడు, మేడిబోయిన జగదీశ్వరరావు అన్నారు. బాలేరు టిడిపి కార్యాలయంలో శనివారం సాయంత్రం మండల కూటమి నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం శత శాతం సూపర్ సిక్స్ అమలు చేసిందని, వైజాగ్‌లో గూగుల్ డేటా సెంటర్ వచ్చిందని, భవిష్యత్తులో ఎందరికో ఇది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, మెగా డిఎస్‌సి ద్వారా 16,500 మంది నిరుద్యోగులు నేడు ఉపాధ్యాయులుగా మారారని ఈ ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు అన్నారు. ఈ అంశంపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని, ఇక నుంచి కూటమి ప్రభుత్వంపై, స్థానిక నియోజకవర్గం ఎమ్మెల్యేపై చేసే దుష్ప్రచారాన్ని ఎండగడుతామని భామని సర్పంచ్ ప్రతినిది లోపింటి రాజేష్ అన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు అంపిలి కేశవరావు, పి.నాగేశ్వరరావు, బిడ్డికి ప్రసాద్, సాకేటి రామారావు, అగు తముడి గోవిందరావు, మన్మధ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు 'చిరు' సాయం



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న స్థానికులు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రం నడిబొడ్డులో ఉన్న పాత బస్టాండ్ కూడలి వద్ద పెద్ద ఎత్తున రోడ్డుకు గుంతలు పడ్డాయి. రాష్ట్రంలో ఉన్న ప్రాంతాల నుంచి ఒడిస్సా, ఛత్తీస్‌గడ్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాలకు ఈ రోడ్డు గుండా ప్రతిరోజు వందలాది భారీ వాహనాల రాకపోకలు సాగించడం వల్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ గోతుల గుండా ప్రయణిం చేందుకు పట్టణ ప్రజలు నా నా అవస్థలు పడుతున్నప్పటికీ, అటు ప్రజా ప్రతినిధులు గాని, మున్సిపల్ పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు గానీ, ఆర్అండ్‌బి అధికారులకు గానీ పట్టించుకోలేదు. దీంతో పట్టణానికి చెందిన చిరంజీవి అభిమానులు, మటన్ షాప్ యజమాని వహాబ్ ముందుకు వచ్చి తన సొంత నిధులతో 8 బస్తాలు సిమెంటు, ఆఫ్ ట్రాక్టర్ 20 యంయం పిక్క రాయి, ఆఫ్ ట్రాక్టర్ ఇసుకను తెప్పించి నలుగురు భవన నిర్మాణ కార్మికులకు కిరాయి ఇచ్చి పాత బస్టాండ్ వద్ద ఉన్న గోతులను కప్పించారు. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న వ్యాపారస్తులు, వాహన చోధకులు, ట్రాఫిక్ పోలీసులు వాహబ్‌కు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.

నకిలీ మద్యం నివారణకు పటిష్ట చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిఐ రమణ

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట సర్కిల్లోని మద్యం దుకాణాల ద్వారా నాణ్యమైన మద్యం అమ్మకాలకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సిఐ రమణ అన్నారు. షాపుల్లో పనిచేసే నౌకరి నామాలకు, లైసెన్సీదారులకు ప్రభుత్వం చే ప్రారంభించిన ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం అమ్మకాలు కొనసాగించాలని తెలిపారు. అందుకు తగు శిక్షణ ఇస్తామన్నారు. ఈ మేరకు శనివారం షాపుల వద్ద యాప్ గురించి అవగాహన కల్పించారు. షాపుల ద్వారా అమ్మకాలు చేపట్టే ప్రతి మద్యం సీసాను ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసి నాణ్యతను తనిఖీ చేసిన పిదప కొనుగోలుదారులకు అమ్మకాలు చేపట్టామని తెలిపారు. కొనుగోలుదారులు కూడా ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని తద్వారా తాను కొనుగోలు చేసిన మద్యం చేశాను సీసాపై గల క్యూ ఆర్ కోడ్ ని స్కాన్ చేయడం ద్వారా సదరు మద్యం సీసా నాణ్యమైన, అది ప్రభుత్వం సరఫరా చేసిందా? లేదా? అని నిర్ధారించుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు, వినియోగించుకునేందుకు తగు సూచనలను ప్రతి మద్యం దుకాణం వద్ద వద్ద పోస్టర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

స్వయం సమృద్ధితో మహిళలు అభివృద్ధి

ప్రజాశక్తి- మందస

గత 20 ఏళ్ల కిందట కేవలం రోజుకు ఒక్క రూపాయి చొప్పున్న నెలకు రూ.30తో పొదుపును ప్రారంభించారని వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని బైరిసారంగపురం పంచాయతీలో మహిళా సంఘాల పనితీరు పొదుపులు, అప్పులు, వారు చేస్తున్న ఆధాయాభివృద్ధి కార్యక్రమాలను, వ్యాపారాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలు పంచసూత్రాలను పాటిస్తూ ... ప్రస్తుతం కొన్ని గ్రామ సంఘాల్లో స్వయం సమృద్ధి సాధించి వారు దాసుకున్న పొదుపు సంఘం నిధుల నుంచే అప్పులు వాడుకొని సొంతంగా వ్యాపారాలు చేసే స్థాయికు ఎదిగాయని అన్నారు. మహిళా సంఘాలు బ్యాంకు, స్త్రీనిధి రుణాలు, వారు దాసుకున్న పొదుపు నుంచి సంఘాలు స్వయం సమృద్ధి సాధించి ప్రస్తుతం



సరుకులను పరిశీలిస్తున్న ఎపిఎ కూర్మారావు

సభ్యులకు అప్పు ఇచ్చి వ్యాపారాలు చేయిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు, విఒఎలు రాణి, పద్మజ, పున్యవతి, క్లస్టర్ కో-ఆర్డినేటర్ మీనాక్షి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు పాల్గొన్నారు.

ఆర్ఒబి పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ రైల్వే వంతెన పనులను శనివారం కూటమి నాయకులతో రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వద్ద ఆర్ఒబి రోడ్డు విస్తరణలకు సంబంధించిన అధికారులు అధికార పార్టీ నాయకులు సమావేశమయ్యారు. అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించి, అక్కడ చుట్టుపక్కల ఉన్న వర్తకులు నిర్వాసితులతో మాట్లాడారు. రోడ్ల విస్తరణ గురించి అధికారుల సమక్షంలో వివరించారు. బ్రిడ్జి పూర్తయ్యే వరకు తొలగించిన భవనాలను పునర్నిర్మించ కూడదని తెలిపారు. షాపులు తొలగింప కార్యక్రమంలో వ్యాపారులకు ఎటువంటి అన్యాయం జరగదని, తెలియకుండా ఏమైనా జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్ మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, బి.నాగరాజు, సవర రాంబాబు, చంద్రశేఖర్ త్యాడి తదితరులు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ లేక అవస్థలు

ప్రజాశక్తి- నందిగాం

మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ పెంటఊరు, శివరాంపురం, నరేంద్రపురం, సుబ్బమ్మపేట, మొండిరావివలస, ఆకులరఘునాథపురం, బెజ్జపల్లి, పోలవరం గ్రామాలకు చెందిన ప్రజలు రోజూ నందిగాం వస్తూ.. ఉంటారు. ఆయా గ్రామాల ప్రజలు బస్సు ఎక్కాలంటే నందిగాం మండల కేంద్రానికి చేరాల్సిందే. అలాగే టెక్కలి, పలాస, విశాఖపట్నం, విజయవాడ ఎక్స్‌ప్రెస్ బస్సులకు వెళ్తుంటారు. అటు మండు ఎండలోనూ ఎండుతూ, ఇటు వర్షంలోనూ తడిసే బస్సుల కోసం వేచియుండి తమ ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. మండల కేంద్రం ఏర్పడి 40 ఏళ్లు కావస్తున్న



మురుగు కాలువపై కూర్చున్న ప్రయాణికులు

మండల కేంద్రంలో కనీసం బస్సు షెల్టర్ లేక ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. తక్షణమే మండల కేంద్రంలో బస్సు షెల్టర్‌ని ఏర్పాటు చేసి ప్రయాణికులను రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

టిడిపి మండల అధ్యక్ష పదవి ఎవరికి దక్కేనో?

పాలకొండ : మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవికి గట్టి పోటీ కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, జనసేన ఎమ్మెల్యే ఇక్కడ ప్రాతినిధ్యం చేయడంతో మండల పార్టీ పీఠానికి గిరాకీ పెరిగింది. ప్రస్తుతం ఉన్న మండల పార్టీ అధ్యక్షులు గండి రామి నాయుడుతో పాటు పలువురు పోటీ పడుతున్నారు. అయితే రామినాయుడుకు తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఉండడంతో వేరే వారికి ఇవ్వాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది తంపట ఉపసర్పంచ్ జాడ శ్రీధర్ పేరు ప్రధానంగా వినిపిస్తుంది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరపున జనసేన ఎమ్మెల్యేకి శ్రీధర్ కష్టపడి పని చేశారని, ఆయనకు పార్టీ పార్టీ పగ్గాలు అప్పగించాలని పలువురు కోరుతున్నారు. అలాగే గోపాలపురానికి చెందిన జయశంకర్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తుంది.

అయితే జయ శంకర్‌ను ఒక గ్రూపు పూర్తిగా వ్యతిరేకిస్తుంది. ప్రస్తుతం ఉన్న మండల పార్టీ అధ్యక్షుల ఎన్నికల ముందు తాను ఎంతో పార్టీ పని చేశానని, తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తుంది. అయితే ఎవరికీ పదవి వరుస్తుందో వేచి చూడాల్సి ఉంది.



రామినాయుడు జయశంకర్ శ్రీధర్

చర్చి ఫాదర్ మృతి

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రంలో ఉన్న డబ్ల్యుఎంఇ పెంటెకోస్టల్ చర్చిఫాదర్ సిహెచ్ జాన్ రత్నం (86) అనారోగ్యంతో విశాఖపట్నం అపోలో ఆస్పత్రిలో శనివారం మృతి చెందారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవులకు చాలా సుపరిచితుడు. తూర్పుగోదావరి జిల్లా అంతరవేదికి చెందిన జాన్ రత్నం 1972లో రణస్థలం వచ్చారు. రణస్థలంలో డబ్ల్యుఎంఇ సంస్థ వసతి గృహాన్ని ఏర్పాటు చేసింది. ఆ వసతి గృహానికి మేనేజర్ అండ్ సూపర్ వైజర్‌గా ఆయనను నియమించింది. ప్రభుత్వం వసతి గృహాలు ఏర్పాటు చేయని రోజుల్లో రణస్థలంలో డబ్ల్యుఎంఇ సంస్థ వసతి గృహం ఒక్కటే రణస్థలంలో ఉండేది. ఈవసతి గృహంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న పిల్లలు వందలాది మంది ఉండేవారు. ఎంతోమంది పేద పిల్లలను అక్కున చేర్చుకుని సొంత పిల్లలకన్నా ఎక్కువగా చూసుకుని విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థుల ను ప్రయోజకులను చేసిన ఘనత ఆయనకే దక్కు తుంది. ఈయనకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

జ్ఞాన భారతి విద్యార్థి ప్రతిభ



మహమ్మద్ కమ్రాన్

ఇచ్ఛాపురం : స్థానిక జ్ఞాన భారతీ విద్యా సంస్థలకు చెందిన 11వ తరగతి విద్యార్థి మహమ్మద్ కమ్రాన్ ఆక్మాల్ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్-19 అంతర్ జిల్లాల అథ్లెటిక్ పోటీల్లో 4 ఇంటు 100 రిలే పరుగులో తృతీయ స్థానాన్ని సాధించాడు. పశ్చిమగోదావరి జిల్లా పెదవేగిలో ఈ పోటీలు ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించారు. జిల్లా జట్టులో సభ్యునిగా ఈ పోటీల్లో అతను పాల్గొన్నాడు. తృతీయ స్థానాన్ని సాధించిన విద్యార్థిని పాఠశాల సెక్రటరీ సిఇఒ జోహార్ ఖాన్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, ప్రధానోపాధ్యాయులు రషీద సుల్తానా, ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీమ్ ఖాన్ అభినందించారు.

సోలార్ లైట్ల ఏర్పాటు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

జొన్నాడ స్మార్ట్ కం పరిశ్రమ తరపున పొన్నాడ గ్రామ జంక్షన్‌లో సోలార్ ఎల్ఇడి టవర్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పొన్నాడ గ్రామ సర్పంచ్ ప్రతినిధి నేతింటే నేలమప్పుడు, గ్రామ పెద్దలు, స్మార్ట్ కం కంపెనీ ప్రతినిధులు రాజేశ్వరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన ఎల్ఇడి లైట్లు

రేకుల షెడ్‌లో అంగన్వాడీ కేంద్రం

నందిగాం: మండలంలోని నందిగాం పంచాయతీ పెంటూరులో ఉన్న అంగన్వాడీ-1 కేంద్రానికి భవనం లేదు. దీంతో పాఠశాల పక్కన ఉన్న రేకుల షెడ్‌లో 1990లో ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు కొనసాగుతుంది. అలాగే పెంటవూరు-2 అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించినా కాంట్రాక్టర్‌కు నిధులు చెల్లించలేదని నెపంతో ప్రారంభానికి నోచుకోక లేదు. ఇప్పుడు శితిలావస్థలో ఉన్న పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. అధికారులు చొరవ చూపి సిద్ధంగా ఉన్న అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించి పెంటూరు-1 అంగన్వాడీ కేంద్రానికి స్థలం కేటాయించి భవనం నిర్మించాలని పలువురు కోరుచున్నారు.



రేకుల షెడ్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రం